**కథ :**

# మధ్య తరగతి దరహాసం

-పి. జయశ్రీ

ఆ రోజు శనివారం. సాధారణంగా శనివారాలు మధ్యాహ్నం ఆఫీస్ నించి మా అమ్మా వాళ్ళింటికి వెళ్తూ వుంటాను. ఆ రోజూ అలాగే మా అమ్మా వాళ్ళింటి వెళ్ళాను.

నే ఇంటికి వెళ్ళేసరికి మా అమ్మ, మా మరదలు సావిత్రి ఏదో చెప్పుకుని నవ్వుకుంటూ వున్నారు.

నన్ను చూడగానే సావిత్రి "రండి, వదినగారూ" అని మంచి నీళ్ళు తేవడానికి వంటింట్లోకి వెళ్ళింది.

నేను మా అమ్మ నడిగాను "ఏమిటి? ఏదో చెప్పుకుని నవ్వుతున్నారు."

ఇంతలో నాకు మంచి నీళ్ళు ఇచ్చి "చెప్తాను. వుండండి" అంది సావిత్రి.

"దానికి మధ్యాహ్నం టిఫిన్ అలవాటు. ముందు. ఏదైనా టిఫిన్ చేసి పెట్టి, కాఫీ ఇవ్వు. తర్వాత చెప్పుచ్చు" అంది మా అమ్మ. కబుర్లు వుంటే చాలు అన్నం నీళ్ళు మర్చిపోయే మా మరదలితో.

'ఏం టిఫిన్ చేసి పెట్టను' అని మా అమ్మ వంక చూసి కొంచెం తచ్చాడుతూ వుంటే "నాకు టిఫిన్ వద్దు. కాఫీ ఇవ్వు చాలు" అన్నాను.

ఇంతలో ఏదో తట్టినట్లు గబుక్కున వంటిం ట్లోకి వెళ్ళిపోయింది.

మా తమ్ముడి ఆఫీసు అప్పటికి మూడు నెలలనించి 'లాకవుట్'లో వుంది. డబ్బుకు ఇంట్లో చాలా కటకటగా వుంది. కాస్తో కూస్తో బాంకులో వున్నది తీసుకుని ఖర్చు చేసుకుంటున్నారు. సొంత ఇల్లు కాబట్టి కొంతలో కొంత నయం. నాకు వీలయినప్పుడు నేను, మా అన్నయ్యకు వీలయినప్పుడు మా అన్నయ్య, మా అక్క డబ్బు ఇచ్చి వాళ్ళని ఆదుకుంటున్నాము.

'ఆఫీస్ ఎప్పుడు తెరుస్తారో ఏమైనా తెలిసిందా?" అడిగాను మా అమ్మని.

"ఆఁ, వచ్చే సోమవారంనించి తెరుస్తారుట" జవాబు చెప్పింది మా అమ్మ.

అటుకుల ఉప్మా చేసి, పెట్టి, కాఫీ ఇచ్చింది మా మరదలు.

"ఇంతకీ ఏమిటి సంగతి?" అడిగాను సావిత్రిని ఇందాకటి సంగతిని గుర్తుచేస్తూ.


"మొన్న, మన పక్కింటి సత్యవతి లేదూ! వాళ్ళ తమ్ముడి కొడుకు మొదటి పుట్టినరోజని మన కృష్ణని, శ్రావ్యని 'బర్త్‌డే పార్టీకి' పిలిచారు.

"వాళ్ళు, అక్క చెల్లెళ్ళు, అన్నదమ్ములు పది, పదిహేను మంది దాకా వున్నారనుకుంటాను" అన్నా సావిత్రి మాటలకు అడ్డు తగులుతూ.

"పన్నెండు మంది" అని మళ్ళీ చెప్పడం మొదలు పెట్టింది.

"ఇంట్లో ఇరవై రూపాయలే వున్నాయి. బాంకులో చివరి రూపాయి వరకు గీకడం అయింది. పిల్లలేమో ఆ పుట్టిన రోజుకి వెళ్ళాలని పట్టుబట్టారు. చుట్టు పక్కల అంతా బెలూన్‌లని, బొమ్మలని, ఆట వస్తువులని కొన్నారు ఆ పిల్లలకి ఇవ్వడానికి. మనం ఏదో ఒకటి ఇవ్వాలి కదా అని వున్న ఇరవై రూపాయలలో ఓ పదిరూపాయలు పిల్లలకిచ్చా. వాళ్ళు దాంతో బొమ్మను కొని సత్యవతి తమ్ముడింటికి పార్టీ కెళ్ళారు.

పిల్లలు వెళ్తుంటే వూరుకున్న వాళ్ళం వూరుకోకుండా "ఫంక్షన్ అవగానే గేటు బయట నించోండి. మనందరం కలిసి ఆ వీధి చివరిలో నున్న రాఘవేంద్రస్వామి గుడికి వెళ్దాం. అందరం కలిసి ఇంటికి



వచ్చేయచ్చు" అన్నాం. పిల్లలు 'సరే' అన్నారు.

నేను, అత్తయ్యగారు, మీ తమ్ముడు, మన ఎదురింటి లక్ష్మి కలిసి ఆరుగంటలకు ఇంట్లోంచి గుడికి బయలుదేరాం.

సత్యవతి తమ్ముడింటి గేటు బయట చూస్తే పిల్లలు కనిపించలేదు. ఇంకా పార్టీ అవలేదు కాబోలు అనుకున్నాం.

వాళ్ళింటి గేటు దగ్గర కొంచెం సేపు తచ్చాడాం.

ఇంతలో దేనికో బయటికి వచ్చిన సత్యవతి మమ్మల్ని చూడనే చూసింది. 'లోపలికి రమ్మ'ని పిలిచింది.

'ఇప్పుడు కాదు ఇంకోసారి వస్తాం' అని ఎంత చెప్పినా వినలేదు. బలవంతపెట్టింది. లోపలికి వెళ్ళాం. చేతిలో వున్నది పది రూపాయలు. రెండు రోజులకు కూరలు కొని మిగతాది దేముడి గుళ్లో వేద్దాం అనుకున్నా. పెద్ద వాళ్ళం వెళ్ళి పుట్టిన రోజు పిల్లాడికి ఏమీ ఇవ్వకపోతే ఏం బాగుంటుంది? ఏం చేయాలి? కూరలు ఎలా కొనాలి? అని ఆలోచన. నేను అత్తయ్యగారి వంక అత్తయ్యగారు నా వంక చూసుకున్నాం.

చాప వేశారు. కూర్చున్నాం. ఇంతలో సత్యవతి చెల్లెళ్ళు ఇద్దరు, ఇంకో మరదలు ఒకరి తరువాత ఒకరు చేతిలో పసి పిల్లతో వచ్చారు. వాళ్ళ వెనకాలే సత్యవతి వచ్చింది. సత్యవతి చెపుతోంది,

'మీరు ఎన్నిసార్లు పిలిచినా మా తమ్ముడింటికి రానేలేదు. ఇది రెండేళ్ళ క్రితం పెళ్ళయిన మా చెల్లెలు వసుధ. దీని కూతురు 'ఇది' అని నెలలోపు పిల్లని నా చేతిలో పెట్టింది. అప్రయత్నంగా చేతులు చాచి పిల్లను తీసుకున్నాను. ఇది క్రిందటి సంవత్సరం పెళ్ళయిన మా చెల్లెలు శాంతి. దీనికి కొడుకు. అని ఇంకో నెల లోపు పిల్లాడిని అత్తయ్య గారి చేతికి అందించింది. ఇది మా మరదలు శ్యామల. దీనికి పదిహేను రోజుల క్రితం కొడుకు పుట్టాడని చెప్పలా? వాడే వీడు. అని ఇంకో పిల్లాడ్ని లక్ష్మి చేతికందించింది.

'మా పక్కన వుంటున్నారు. సుందరమ్మగారు చాలా మంచి మనిషి అని చెప్పానే ఆవిడే ఈవిడ అని అత్తయ్య గారిని వాళ్ళకు పరిచయం చేసింది.'

నాకు ఆవిడ చెప్పింది ఒక్కటీ బుర్రకెక్కడం లేదు. నా చేతిలో వున్న పది రూపాయలు నా కళ్ళ ఎదురుగా వున్న సంవత్సరం లోపు పిల్లలు మెదలుతున్నారు.

పసి పిల్లలని, స్త్రీలని, వృద్ధులని, రోగులని వుట్టి చేతులతో చూడటానికి వెళ్ళకూడదంటారు. కాని ఇలాంటి పరిస్థితులలో ఏం చెయ్యాలో వాళ్ళు చెప్పలేదు.

ఈ పది రూపాయలు ఎవరికివ్వాలి? ఎవరికి మానాలి? ఇస్తే రేపటి సంగతి? ఒక పక్క లోపలికి వచ్చినందుకు నామీద నాకే కోపంగా వుంది. అత్తయ్యగారు తికమకగా నావంక చూస్తున్నారు. నేను అత్తయ్యగారి వంక, లక్ష్మి వంక చూసాను. ముగ్గురం పిల్లల వంక మాత్రం చూడటం లేదు. బిక్క చచ్చిపోయి వున్నాం.

సత్యవతి పిల్లల పేర్లు చెపుతోంది. వీడు... వీడు.... దీనిపేరు... ఒక్కటీ వినపడటం లేదు.

ఇంటిలోపలికి వచ్చి ఎంత పొరపాటు చేశాం. ఆ గుడికెళ్ళేదేదో రెండు రోజుల తర్వాత వెళ్దామను కున్నాపోయేది. పిల్లలు వాళ్ళ మానాన వాళ్ళు ఇంటికి వచ్చేవాళ్ళు. నన్ను నేను తిట్టుకున్నాను. ఏం అనుకుని ఏ లాభం. జరగాల్సిందేదో జరిగిపోయింది. ఇప్పుడు ఏం చెయ్యాలి? అదే ప్రశ్న.

లక్ష్మి నా వంక మళ్ళీ చూసింది. లక్ష్మి దగ్గర ఓ పదిరూపాయలుంటే తీసుకుని నలుగురు పిల్లల చేతుల్లో నాలుగైదులు పెడితేసరి. కూరల సంగతి దేముడెరుగు అనుకున్నాక కొంచెం ధైర్యం వచ్చింది.

లక్ష్మిని అడిగా మెల్లగా "నీ దగ్గర డబ్బు ఎంతుంది అని."

"ఐదు రూపాయలున్నాయి" అంది లక్ష్మి. అని వూరుకోకుండా సన్నగా గొణిగింది.

"ఇదేమిటండీ బాబు, ఈ గోల ఎరక్క పోయి లోపలికి వచ్చాం. వీళ్ళేమో ఒకళ్ళ తరువాత ఒకళ్ళు ముగ్గురు పిల్లలని మనకి చూపిస్తున్నారు. వీళ్ళు కాక ఆ పుట్టిన రోజు పిల్లాడొకడు. ఇలా వీళ్ళ ఇంటికి వెళ్దామని ముందే అనుకుంటే ఏ స్టీలు గ్లాసులోనో కొంచెం పంచదార వేసి తీసుకొచ్చేవాళ్ళం. (తమిళులు సాధారణంగా చిన్న పిల్లల్ని చూడటానికి వచ్చినప్పుడు. పంచదార తీసుకొచ్చి కొంచెం పిల్లల నోటికి తాకించి, ఇచ్చి వెళ్తూ వుంటారు.) మీరూ ఏదో సామాను తెచ్చేవారు. సరిపోయేది. ఇదేం ఖర్మరా బాబు! చేతులో డబ్బులు ఎక్కువ లేకుండా మనం బయటికి రావడం ఏమిటి. వీళ్ళు ఈ పిల్లల్ని మనచేతుల్లో పెట్టడం ఏమిటి.'

లక్ష్మి మాటలకు నాకు పగలబడి నవ్వు వస్తోంది. వాళ్ళకి తెలుగు రాకపోవడం మా అదృష్టం. నవ్వని పాపని 'నవ్వుతోంది' చూడండి అని నేను నవ్వేశాను, నాకు నవ్వు ఆపుకోవడం కష్టమయి.

లక్ష్మి దగ్గరనించి అయిదు రూపాయలు తీసుకుని పది రూపాయల లోపల పెట్టి, పిల్లల కివ్వమని, చెప్పి సత్యవతి చేతిలో పెట్టి, పిల్లలని వాళ్ళ వాళ్ళ తల్లుల కిచ్చి బ్రతుకు జీవుడా అని బయటపడ్డాం.

బయటకు వచ్చాక మా పరిస్థితికి మాకే నవ్వొచ్చింది. ఇంక గుడి లేదు గోపురం లేదని ఇంటికొచ్చి పడ్డాం.

"ఆ సంగతి చెప్పుకుని నవ్వుకుంటున్నాం" ముగించింది సావిత్రి.

నాకూ నవ్వొచ్చింది. సావిత్రి చెప్పిన విధానానికి.

"మరి"

"ఏ చేస్తాం? ఇంట్లో కంది పప్పు వుంది. పచ్చడి చేసి చారు పెట్టా. నిన్న ఎక్కడినించో రెండొందలు అప్పు తెచ్చాడు మాధవుడు" చెప్పింది మా అమ్మ.

మా అమ్మ చేతిలో ఐదు వందలుంచి మా ఇంటికి బయలుదేరాను.

చాలీ చాలని జీతాలతో గడిపే మధ్య తరగతి వాళ్ళకి కూడా నవ్వడానికి ఎలాంటి పరిస్థితులు కలిపిస్తూ వుంటాడో భగవంతుడు అనుకుని నవ్వుకున్నాను, మా ఇంటికి తిరిగి వెళ్తూ.

❁



# స్త్రీలు చట్టము

నిర్వహణ : బి.వి. నాగరత్న
న్యాయవాది, బెంగళూరు

మృదుల — మైసూరు

మా మావగారికి నా భర్తతో కలిపి ఇద్దరు కుమారులున్నారు. మా మావగారికి పిత్రార్జిత ఆస్తినాలుగు ఎకరాలు, ఒక ఇల్లు వుంది. మావారు తనకు ఆ పిత్రార్జిత ఆస్తిలో భాగం వద్దన్నారు. మాకు నాలుగేళ్ల బాబువున్నాడు. అతనికి ఈ ఆస్తిలో భాగం రావాలంటే ఏం చేయాలి? మా వారు ఆస్తిలో తనకు భాగం వద్దని రాసిస్తే, అది మా బాబుకు లభిస్తుందా?

ఆస్తి పిత్రార్జితం కాబట్టి అందులో మీ మావ గారికి, మీ భర్తకు, మీ బాబుకు హక్కు వుంటుంది. ఒకవేళ ఆస్తి మీకుటుంబంలో విభజించబడితే మీ మావగారికి మీ భర్తకు, మీ మరిదికి అందులో 1/3వభాగం లభిస్తుంది. మీ బాబుకు ఆ భాగంలో సగం లభిస్తుంది.

హిందూ చట్ట ప్రకారం కుమారుడు పుట్టడంతోనే పిత్రార్జిత ఆస్తిలో భాగస్థుడవుతాడు. మీ భర్త మీ బాబుకు పిత్రార్జిత ఆస్తి లభించకూడదని ప్రయత్నిస్తే మీరు మీ బాబు తరపున కోర్టులో దావా వేసి, అతని భాగం ఆస్తిని కోర్టు ద్వారా పొందవచ్చు.

జయలక్ష్మి — బెంగళూరు

**మేము దాదాపు 18 సంవత్సరాల క్రితం ఒక ఇంటికి బాడుగకు వచ్చాము. అప్పుడు మేము నెలకు రూ. 150/- ఇచ్చేవాళ్లం. ఇప్పుడు రూ. 750/- ఇస్తున్నాము. ఇంటి యజమాని పై సంవత్సరం మరలా అద్దె పెంచుతానని బెదిరిస్తున్నాడు. మాకు ఆ ఇల్లు, చుట్టు ప్రక్కల పరిసరాలు బాగా అలవాటైనాయి. కాబట్టి ఖాళీ చేసే ప్రసక్తి లేదు. యజమాని బాడుగను మళ్లీ పెంచకుండా చట్టరీత్యా మేము ఏదైనా చర్య తీసుకొనడానికి వీలుందా? (అతను బాడుగకు రసీదు ఇవ్వడం లేదు).**

కర్నాటక రెంట్ కంట్రోల్ ఏక్ట్ 1961 లోని సెక్షన్ 21 ప్రకారం ఇంటి యజమాని, ఆ సెక్షన్‌లో ఇవ్వబడిన కారణాలను సమర్థిస్తూ, బాడుగకున్న వారిని ఇల్లు ఖాళీచేయించవచ్చు. మిమ్మల్ని ఖాళీ చేయించాలంటే ఇంటి యజమానికి మరోదారి లేదు. అలాగే బాడుగకు రసీదు ఇవ్వకపోతే అది చట్ట విరుద్ధం. దానికి సంబంధించిన అధికారులు చర్య తీసుకోవచ్చును.

ఒకవేళ మీరిచ్చే బాడుగ తక్కువ అని యజమాని భావించే పక్షంలో, అతను దానికి సంబంధించిన అధికారులకు న్యాయమైన అద్దె (Fixation of Fair rent) గురించి అర్జీపెట్టుకోవచ్చు. అది తీర్పు అయ్యేవరకూ ఇంటి యజమాని అద్దె పెంచడానికి వీలులేదు.

విశ్వనాథ్ — విజయవాడ

**నాకు వివాహమై ఆరు సంవత్సరాలవుతోంది. నా భార్య ఒక పాపను ప్రసవించి దురదృష్టవశాత్తు మరణించింది. ఒంటరి వాడిని, పాపను చూసుకోవడం కష్టమవుతోందని ఒక సంవత్సరంపాటు ఆ పాపను మా అత్త మావల సంరక్షణలో వుంచాను. ఆ సమయంలో నా భార్య నగలను, ఆమె పేరట వున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ సర్టిఫికేట్ ఇతర వస్తువులు కూడా వారికి అప్పగించాను. ఇటీవల నేను పునర్వివాహం చేసుకున్నాను. నా పాపను మా అత్తమావల వద్ద నుంచి తెచ్చుకుని పెంచుకుంటున్నాను. నేను గతంలో ఇచ్చిన నగలు, సర్టిఫికేట్‌లు వాపస్ ఇవ్వమని అత్తమావలను అడిగితే వారు వాటి విషయం తమకు తెలియదని బుకాయిస్తున్నారు. ఈ విషయంలో నాకు చట్టం ఏ విధంగా సహకరిస్తుంది?**

మీరు నగలు, ఎఫ్.డి. రసీదులు వగైరా అత్త మామలకు ఇచ్చినట్లు సాక్ష్యం వున్నదా? అది ఉన్న పక్షంలో వాటిని తిరిగి పొందడానికి మీరు మీ అత్తమామలపై కోర్టులో కేసు వేయవచ్చును.

పేరు రాయలేదు — ....

**నా భర్త దాదాపు 5 సంవత్సరాల క్రితం మరణించారు. ఆయనకు చక్కెర కార్ఖానాలో షేర్లున్నాయి. కానీ ఆయన వాటిని ఎవరి పేరిటా నామినేషన్ చేయించలేదు. మాకు ఇప్పుడు డబ్బు అవసరపడింది. ఆ ఫాక్టరీలో ఈ షేర్స్ గురించి విచారిస్తే వారెవరూ తగిన శ్రద్ధ తీసుకోక, నన్ను నిర్లక్ష్యపరుస్తున్నారు. నేనిప్పుడేం చేయాలి?**

మీరు షేర్లను అమ్మాలంటే ముందుగా వాటిని మీ పేరుకు ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలి. ఆ తరువాతనే వాటిని అమ్మి డబ్బు పొందవచ్చు. దీనికి ముందు మీరు తాసీల్దార్ నుంచి సక్సెషన్ సర్టిఫికేట్ లేదా సర్వయివర్ సర్టిఫికేట్ పొందవలసి వుంది. కంపెనీ వారు తాసీల్దార్ సర్టిఫికేట్‌ను అంగీకరించని పక్షంలో మీరు, కోర్టులో పొందాలి. ఇందుకోసం మీరు, మీకు దగ్గరలోని ఒక వకీలును సంప్రదించడం మంచిది.

❑